# అంతర్వాణి



కూరగాయల సంచీ, కొండవీటి చాంతాడు లాంటి లిస్టూ చేతబట్టుకొని. చెప్పులు తగిలించుకొని మార్కెట్‌కి వెళ్ళబోతూన్న నన్ను వెనకనుంచి కంగారుగా కేకవేసింది మా ఆవిడ "ఏమండీ.." అంటూ.

ఆగి "ఏం?" అన్నాను.

"గొడుగు తీసుకెళ్ళరేం?"

"గొడుగా! ఇంకా సరిగ్గా పొద్దన్నా పొడవలేదు ఇప్పుడే గొడుగెందుకూ?" అన్నాను ఆశ్చర్యపడుతూ.

"పిచ్చి! ఎండనికాదు-వర్షమొస్తుందేమోనని" అన్నది మా ఆవిడ!

"పిచ్చి నీకు, లేకపోతె ఈ ఏప్రెల్ నెలలో వర్షం రావడమేమిటి? ఆకాశంలో ఎక్కడా మబ్బుతునక కూడాలేదు .."

"ఏమోబాబూ మీకు అన్నీ చెప్పలేను. అయినా వయసు ముదురుతూన్న

కొద్దీ మీకు షోకు లెక్కువై పోతున్నాయి. బయటికెళ్తున్నారు కదా గొడుగు పట్టుకెళ్ళటం కూడ మోటు అనుకొంటే ఎలా?" అంటూ దీర్ఘం తీసింది.

"సరేలే. రాత్రి రెండో ఆట చూసొచ్చిన మత్తు ఇంకా వదలనట్టుంది నీకు" అంటూ బయటి కొచ్చేసాను.

ఇంకా బాగా పొద్దెక్కక పోవటం వల్ల చల్లగా ప్రాణానికి హాయిగా ఉంది. పుచ్చు కూరలు తెస్తే మా ఆవిడ లాంగ్‌ప్లే రికార్డు వేసుంది. అందువల్ల వళ్ళు దగ్గర పెట్టుకొని మంచి మంచి కూరగాయలు ఏరి, గీసి గీసి బేరమాడి లిస్టులో ఉన్నవన్నీ కొనేసాను. తెచ్చిన డబ్బులో ఐదుపైసలు మిగిలాయి. సోడాకి మా ఆవిడ అంత కచ్చితంగా ఏలా లెక్కవేయ గలుగుతుందో నాకు అర్థంకాని విషయం. సంసారమంత బరువైన ఆ కూరగాయల సంచి చేతబట్టుకొని తలపైకెత్తి చూద్దును కదా ఆకాశమంతా మేఘాలతో నిండిపోయి ఉంది. నల్లని మేఘాలు ఒకదాన్నొకటి నెట్టుకొంటూ ఇంకా వచ్చి పడుతున్నాయి. ఇదేం ఖర్మరా బాబూ అనుకొని ఇంటివేపు నడక మొదలెట్టాను అర ఫర్లాంగుదూరం వచ్చానో లేదో దబ దబా బాదేయటం మొదలెట్టింది. వర్షం! ఎక్కడన్నా కాసేపు తలదాచుకొందామంటే ఒక పక్క పార్కు, రెండోపక్క ఖాళీ స్థలం. పార్కు దాటే సరికి పూర్తిగా తడిసిపోయాను.

మా ఆవిడ నోటివాక్కు!

నాలుగైదు రోజుల తర్వాతకాబోలు, ఉదయమే బ్రష్ నోట్లో పెట్టుకొని బాత్‌రూమ్‌కి వెళ్ళబోతూండగా, మా ఆవిడ బండెడు మినప్పప్పు రోట్లోపోసి చెమటలు కక్కుతూ రుబ్బటం కనిపించింది. నకు ఆశ్చర్యమేసింది. మేం ఇంట్లో ఉన్నది ఇద్దరం. అంత మినప్పప్పు ఎందుకో అర్థం కాలేదు. "ఏమిటీ కథ? కాఫీ హోటలు పెడుతున్నావా ఏం?" అన్నాను పొద్దున్నే మంచిజోకు జోకాను కదా అని గర్వపడుతూ.

"మా తమ్ముళ్ళనూ, చెల్లెళ్ళనూ చూసి చాలకాలమైపోయిందండీ. రాత్రంతా కలలోకివస్తూనే ఉన్నారు." అన్నది. పైట కొంగుతో కన్నీళ్లు తుడుచుకొంటూ

దానికీ, మినప్పప్పుకీ ఉన్న సంబంధమేమిటో నా మట్టిబుర్రకి తట్టలేదు. దాన్ని గురించి ఆలోచించటంకూడ అనవసరమే. తాగుబోతు నడకలో ఎంత కో-ఆర్డినేషన్ వుంటుందో మా ఆవిడ మాటల్లో కూడా అంతే ఉంటుంది. స్నానం అదీ ముగించుకొని అరగంట తర్వాత బాత్‌రూమ్‌లోంచి బయటికొచ్చి చూద్దును గదా, ముగ్గురు మరదళ్లు, ఇద్దరు బావమరుదులతో వంటిళ్ళంతా ఉడిపీ హోటల్లా వుంది. అప్పుడే సర్కార్ ఎక్స్‌ప్రెస్‌కి దిగారట అయిదుగురూ!

కొంపదీసి మా ఆవిడకి టెలిపతీ లాంటిదేం లేదుగదా!

ఆ రోజు మన ఇందిరా గాంధిగారు తన ఇరవై సూత్రాల పథకం గురించి స్వయంగా రేడియోలో మాట్లాడబోతోందని పేపరులో చదివి అదేమిటో విందామని రేడియో పెట్టాను. అదేం ఖర్మమో గాని ముట్టుకోక ముట్టుకోక ఆ వేళ నేను రేడియో ముట్టుకుంటే, గుర్- గర్-




బర్‌_ మనే చౌ చౌ శబ్దాలే తప్ప ఇందిరా గాంధి మాటలు వినిపించలేదు. కొత్త రేడియో చెడగొట్టడానికి మా ఇంట్లో పిల్లలు కూడ లేరు. ఏమొచ్చిందబ్బా దీనికి? ఒకవేళ ....

"జానకీ" అంటూ కేక వేశాను టాప్ లేచిపోయేట్లు.

"పిల్చారా ?" అంటూ వంటింట్లోంచి తాపీగా వచ్చింది అట్లకాడ చేత బట్టుకొని.

"రేడియో చెడగొట్టిన దానివి నాతో చెపితే బాగుచేయించే వాణ్ణిగా! ఇప్పుడు ఇందిరా గాంధిగారి ఇరవె సూత్రాల పథకం విందామంటే దీని నోట్లోంచిమాటే ఊడి పడ్డంలేదు అన్నాను కోపంగా.

"బాగుంది. నేనేం చిన్నపిల్లనా చెడ గొట్టటానికి" అంటూ అట్లకాడతో ఠపీ మని ఓ మొట్టికాయ వేసింది. (నా నెత్తి మీద కాదు. రేడియో నెత్తిమీద) అంతే! స్పష్టంగా, ధారాళంగా మాట్లాడటం మొద లెట్టింది రేడియో!

అప్పట్నుంచి మా ఆవిడ మాట్లాడే అర్థంలేని మాటల్లోనూ, చేసే అర్థంలేని చేతల్లోనూ ఏదో అర్థమున్నట్లే అనిపించ సాగింది. తర్వాత ఏదో పత్రికలో ఒక వ్యాసం చదువుతూంటే intuition అనే మాట ఒకటి కంటబడింది. దానికి సరి అయిన తెలుగుమాట ఎంత వెతికినా నా కెక్కడా కనిపించలేదు. కాని డిక్షనరిలో ఇచ్చిన వివరణను బట్టి దాని అర్థం 'అంతర్వాణి' అని చెప్పుకోవచ్చు. ఆడ వాళ్ళలో ఇది ఎక్కువట. వాళ్ళలో ఉన్న ఈ శక్తి వలన భవిష్యత్తును అమోఘంగా ఊహించగలరట! సామాన్యులకు అర్థం కాని లోపాలను, జబ్బులను వీరు చెప్ప గలరట! 'ట' ఎందుకు _ మా ఆవిడే కళ్ళెదుట కనపడుతూంటే! (అంతరాత్మ ప్రబోధమన్నా ఇదేనా ?) ఆ తర్వాత జరిగిన మరికొన్ని సంఘటనలు, మాఆవి డలో ఈ శక్తి ఉన్నదనే నా అభిప్రా యాన్ని మరి బలపర్చాయి.

ఉదాహరణకు :

మా ఇంట్లో మా తాతగారో, ముత్తాత గారో కొన్న అలారం గడియారం ఒకటి

ఉంది. అది, ఒకరోజు గంట ఫాస్టు, మరొరోజు గంట స్లో ఆడుతూండేది. అందువల్ల దాన్ని పాతసామాన్లలో పడే సాము ఆ నెల ఒకటో తారీకునుంచి నాకు నైట్‌డ్యూటీ పడింది. ప్రతి రాత్రీ రెండుగంటలకు మూడో షిఫ్టుకి వెళ్ళాలి నేను. అందుకని మూలనపడేసిన ఆపాత గడియారాన్ని రిపేరు చేయిదామని బయ టకు తీశాను. మా ఆవిడ చూచి "ఎందు కండీ దానికి రిపేరు శుద్ధదండుగ? బల్ల మీద బోర్లా పడుకోబెట్టండి. అదే ఆడు తుంది" అన్నది. అదేం చిత్రమొగాని ఆవిడ చెప్పినట్లుచేసేసరికి అన్ని సంవత్స రాలు పనిచేయకండా మూలన పడేసిన గడియారమూ టిక్ - టిక్ - మంటూ ఆడటం మొదలెట్టింది - అదీ సెకండ్లతో సహా కరెక్టుగా. ఆశ్చర్యంగా లేదూ?

మరోసారి ఏంజరిగిందంటే: వేసవి కాలం కావడంవల్ల మేమిద్దరం రాత్రిళ్ళు డాబామీద చాపలు వేసుకొని పడుకొనే వాళ్ళం. అయినా దొడ్లో ఉన్న మెట్లవేపు తలుపుకు ఎన్నడూ తాళం వేసేవాళ్ళం కాదు, ఆరోజు భోజనాలయ్యాక పక్కలు డాబామీద పరిచి క్రిందికి దిగివచ్చి మా ఆవిడి ఆ తలుపుకు జాగ్రత్తగా తాళం వెయ్యటం చూసి "ఏవిటి సంగతి? ఇది వరకు ఆ తలుపుకు తాళం వెయ్యమని ఎన్నిసార్లు మొత్తుకున్నా వినని దానివి ఇవ్వాళ అంత జాగ్రత్తగా తాళంవేస్తున్నా వేం?" అని అడిగాను.

"ఎప్పుడూ మనరోజులేనా ఏమిటి? అని ఎదురు ప్రశ్న వేసింది మా ఆవిడ.

"కొంపదీసి దొంగలు పడతారని కల గాని వచ్చిందా?"

"నాకు అలాంటి పాడుకలలు ఎన్నడు రావులెండి. వెయ్యాలనిపించింది వేసాను. అంతే" అన్నది.

మర్నాడు నిద్ర లేచేసరికి మా పక్క పోర్షన్లో దొంగలుపడి శుభ్రంగాఊడ్చుకు పోయారని తెలిసింది. మా ఆవిడ తాళం వెయ్యకుండా ఉంటే మా ఇల్లు బోడి గుండయి పోయేదే: అంతర్వాణి మహిమ కాకపోతే ఇదేమిటి చెప్పండి?

అప్పట్నుంచీ మా ఆవిడిలో విని పించే అంతర్వాణి మీద నాకు విపరీత మైన నమ్మకం ఎర్పడింది. ఆవిడ ఏమి చెప్పినా-ఆ క్షణంలో అదెంత చాదస్తంగా కనిపించినప్పటికీ, తూ. చా. తప్పకుండా పాటించే వాణ్ణి.

ఆ సంవత్సరం జూలై నెలలో మా ఆవిడ చెల్లెలికి పెళ్ళి కుదిరింది. పెళ్ళి కొడుకుది అనంతపురం-స్టేట్ బాంక్‌లో పని చేస్తున్నాడట. ఆ విషయం తెలిసి నప్పటినుంచీ మా ఆవిడ సంతోషానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. "పెళ్ళికి ఓ ఇరవై రోజులు సెలవు పెట్టండి" అన్నది.

"ఎందుకూ అన్ని రోజులు?" అన్నాను.

"అనంతపూర్ నుంచి పెళ్ళయ్యాక బెంగుళూరు పోదాం,చాల దగ్గరట అలాగే మైసూరు, మద్రాసు అన్నీ చూస్తూ సరదాగా తిరిగివద్దాం" అన్నది.

"బాగుంది! నీ చెల్లి పెళ్ళికి చదివింపు లకు డబ్బెలాగా అని నేను ఆలోచిస్తూంటే మద్రాసూ, బెంగుళూరట!" అన్నాను.

"మీకెప్పుడూ డబ్బు గొడవే! అదే వస్తుంది డబ్బు. ముందు మీరు సెలవు

పెట్టండి." అని ఆజ్ఞాపించింది మా ఆవిడ.

"ఎక్కణ్ణుంచి వస్తుందేమిటి? నీ తరపునగాని, నా తరపునగాని ఆస్తి ఇచ్చి చచ్చిపోయె ముసలాళ్ళెవరూ లేరే!" అన్నాను.

"అబ్బబ్బ. మీతో ప్రతి దానికీ ఇదే గొడవ. శుభకార్యం తలపెట్టాక డబ్బు సమకూడకుండా ఉంటుందటండీ మీ వెర్రిగాని? మీరే తెస్తారు!" అని ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ లోపలకు వెళ్ళిపోయింది మా అవిడ.

ఆవిడ ధీమా ఏమిటో నాకు అర్థం గాలేదు ........కాదు.... అర్థమైంది .... నేను ఆవేళ ఉదయం ఒక లాటరీ టికెట్టు కొన్నాను? .... .... ఎప్పుడూ కొనని వాణ్ణి లాటరీ టికెట్టు కొన్నాను, ఉదయం సిగరెట్ పాకెట్ ఒకటికొని పది రూపాయల నోటు ఇచ్చాను కొట్టు వాడికి. వాడు నాకు తిరిగి ఇవ్వవలసిన డబ్బుకు ఒకరూపాయి తక్కువైంది. "పోనీ ఒక లాటరీ టికెట్ తీసుకోండి సార్" అన్నాడు వాడు. అంతలో ఫాక్టరీ బస్ రావటం కనిపించింది. అది తప్పితే స్వంత డబ్బుతో సిటీ బస్‌లో వెళ్ళాలి. సరేనని, వాడిచ్చిన లాటరీ టికెట్ చేబులో వేసుకొని బస్సెక్కిపోయాను. నాకు ఇప్పటివరకూ ఆ సంగతే గుర్తులేదు. అదేనా మా ఆవిడ ధైర్యానికి కారణం? అంటే నాకు లాటరీలో బహుమతి వస్తుందా?— ఆలోచించిన కొద్దీ నాకు నమ్మకం కలుగ సాగింది. అందులోనూ మా ఆవిడ అంతర్వాణిగా తిరుగులేదు! టీ తాగి వారపత్రిక తెరిచానన్న మాటేగాని ఉద్వేగం వల్ల నాకు అక్షరాలు కనిపించలేదు. దృష్టి ఎందుకో 'తారాబలం' మీదకు పోయింది. ఆశ్చర్యం! నా నామ నక్షత్రం కింద "ఈ వారం మీకు అకస్మాత్ ధనలాభం...." అని ఉంది. లాటరీ టిక్కెట్ మీద డ్రా తేదీ చూశాను. సరిగ్గా అదే వారంలో డ్రా! మా మరదలు పెళ్ళికూడా అదేరోజు! నాకు మూర్ఛ వచ్చినంత పనైంది. లాటరీలో బహుమానం రావటం ఖాయం! వెంటనే సెలవుకు దరఖాస్తు పెట్టాను.

అంతా బాగానే ఉందిగాని సెలవు మంజూరు దగ్గరే మానేజరు పేచీపెట్టాడు. నేను అడిగిన తారీకు కన్నా పదిరోజులు ముందుగా అయితేనే సెలవు మంజూరు చెయ్యటానికి వీలవుతుందని అన్నాడు, పోనీ మద్రాసు, బెంగుళూరు, మైసూరు యాత్రలు ముగించుకొనే మరదలు పెళ్ళికి వెళ్ళొచ్చని అలాగే ఇవ్వమన్నాను. వెంటనే మంజూరు చేసి పారేశాడు.

అయిదుగురు స్నేహితుల దగ్గర రెండేసి వందలు చొప్పున వెయ్యి రూపాయలు అప్పుచేసాను. మా మరదలు పెళ్ళి పదిరోజులుందనగా మా ప్రేమయాత్ర మొదలెట్టాం. మద్రాసు, మైసూరు, బెంగుళూరు—బ్రహ్మాండంగా జరిగింది. పెళ్ళయిన కొత్త రోజులు గుర్తొచ్చాయి. మా మరదలు పెళ్ళి రేపనగా అనంతపూర్ చేరాం. పెళ్ళి కూడ బ్రహ్మాండంగానే జరిగింది. అప్పుచేసిన డబ్బులో ఎనిమిది రూపాయలు మిగిలాయి. తిరుగు ప్రయాణంలో గుంటకల్ స్టేషనులో పేపరు కొన్నాను లాటరి ఫలితాలకోసం. మొదటి బహుమానం కాదుగదా కనీసం ఆఖరు బహుమానం యాభై రూపాయలు కూడ తగల్లేదు నాకు! హుఁ—అంతర్వాణి! నా బొంద!

(సమాప్తం)